# పాతసారా - కొత్తసీసా

"ఏమిటోయ్ కూర్చుని కునుకు తీస్తున్నావ్?"

పరధ్యానంగా, ఏదో ఆలోచిస్తూ కూర్చున్న నేను ఉలిక్కిపడి చూసాను. 'కేబిన్' తలుపు తెరుచుకొని లోనికి వస్తున్నాడు, ప్రకాశరావు.

"అవునులే, నీకేమిటి...." ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని అన్నాడు, అతను. "డ్యూటీ సక్రమంగా చేసినా, చెయ్యకపోయినా, డ్యూటీలో కునుకు తీసినా రావాల్సిన యింక్రిమెంట్లు, ప్రమోషన్‌లూ కొట్టేస్తున్నావు కదా?"

నాకు చిరాకువేసింది. అతను నోరెత్తకుండా వుండే విధంగా జవాబివ్వాలి అని అనుకున్నాను. కానీ......

ఏమీ చెప్పలేకపోయాను.

అతనితో గొడవ పడటము నాకు యిష్టములేదు. అతను మా పై ఆఫీసరుకి చాలా సన్నిహితుడు.

ఏమీ మాట్లాడకుండా వర్క్‌షాపువైపు దృష్టి మళ్ళించాను. సంవత్సరాల తరబడి తిరిగి, తిరిగి అరిగిపోయిన యంత్రాలు రంగులు వేయటము వల్ల కొత్తగా కనిపిస్తున్నాయి. జుత్తుకి రంగు వేసుకొని, యువకులుగా కనిపించటానికి ప్రయత్నించే పనివారు వర్క్ షాపులో అక్కడక్కడా తిరుగుతున్నారు.

"ఏమిటలా మాట్లాడకుండా వుండిపోయావ్?" ఓ సిగరెట్టు వెలిగిస్తూ అడిగేడు ప్రకాశరావు. "ఏదైనా సమస్యా?"

"ఏమీలేదు" అతన్ని వదిలించుకోవాలనే ఉద్దేశ్యముతో అన్నాను. "తల నొప్పిగా వుందిలే"

"ఓ అంతేనా? ఉత్త తలనొప్పికే యిలా అయితే....." అతను పొగ గట్టిగా పీల్చి అన్నాడు. "రేపో, మాపో ప్రమోషను అందుకొని మరికొన్ని బాధ్యతలు మోయవలసినవాడివి."

"ప్రమోషనా"

"అవును ప్రమోషనే, బాసు చెప్పలేదా. ఈరోజు బాసుని కలిసినట్లున్నావు?"

"నాకు ప్రమోషన్ ఏమిటండీ, నా కంటే ఎంతోమంది సీనియర్స్ ఉండగా?"

"అలా అనుకోకు" ప్రకాశరావు అన్నాడు. "మనమేమన్నా ప్రభుత్వ రంగసంస్థలో పనిచేస్తున్నామా ఏమిటి, రూలు ప్రకారం, సీనియారిటీ ప్రకారము ప్రమోషన్ రావటానికి. ఇది ప్రయివేటు కంపెనీ బాస్ యిష్టం"

"అలా ఇష్టానుసారము ప్రమోషన్ యివ్వకూడదనీ, చేసే పనిని బట్టి యివ్వాలనీ మన బాస్ చెప్తూ వుంటారు కదండీ?"

"ఓ, అదా" ప్రకాశరావు గట్టిగా నవ్వుతూ అన్నాడు. "పిచ్చివాడా అవన్నీ వుత్తుత్త మాటలే. నీకు తెలీకపోవచ్చులే, కుర్రవాడివి అనుభవము తక్కువ కదా"

నిజమే ! బొత్తిగా పదేళ్ళ అనుభవము కూడా లేని నాకెలా తెలుస్తుంది యాజమాన్యపు పద్ధతులు.

"అంతా నువ్వు అనుకున్నట్లు అయితే మనరాజు ఎందుకిలా వుంటాడు?"

నిజమే ! రాజు కష్టపడి పనిచేస్తాడు. మూడుపదుల సంవత్సరాల అనుభవము గల అతనికి తెలియని పని అంటూ ఏదీ లేదు. నేను ఉద్యోగములో చేరిన కొత్తలో కొన్ని రోజులు అతనితో కలసి పనిచేసానుకూడ. ముప్పది సంవత్సరాలలో అతనికి ప్రమోషన్ రాకపోవటం ఏమిటని ఆలోచిస్తూ వుండేవాడిని, ఆ రోజులలో.

"పనితోనే పైకి రాలేవునాయానా" ఆమాటే అడిగినప్పుడు రాజు అన్నాడు. "పని చేసినా, చెయ్యకపోయినా పెద్ద వాళ్ళని సంతృప్తిపరచటము నేర్చుకోవాలి"

"నువ్వు మూడ్‌లో లేనట్లున్నావు" ప్రకాశరావు లేస్తూ అన్నాడు. "మనబాస్ నిన్న మీయింటికి వచ్చారట కదా? ఇంకా ఏముంది. నీవు బాస్ సర్కిల్ లోకి వచ్చేసినట్లే, ప్రమోషన్ కొట్టేసినట్లే". ప్రకాశరావు వెళ్ళిపోయాడు.

బయట వర్క్‌షాపులో ఎవరో వెల్డింగు ప్రారంభించారు. "ఇలట్రాడ్"కి నిప్పు అంటుకుంది.

నిన్న మా బాస్ మా యింటికి రావటము నిజమే! మా యింటినీ, పిల్లలని మెచ్చుకున్నారన్నదీ నిజమే! ఇల్లు చక్కగా తీర్చిదిద్దిందని, మా ఆవిడని అభినందించటమూ నిజమే! కానీ, ఈ రోజు కేబిన్‌కి పిలిచి ఇంత తుచ్ఛమైన కోరిక కోరతాడని అనుకోలేదు. నాకేమి చెయ్యాలో తోచటము లేదు. మా బాస్ కోరిక మన్నిస్తే......

ప్రమోషన్ రావచ్చు.

మన్నించకపోతే .....

ముప్పది సంవత్సరాలుగా ప్రమోషన్ రాని రాజు వర్క్‌షాప్‌లో తిరుగుతూ కనబడ్డాడు.

కొత్తగా కనబడాలని రంగులు వేసినా, అక్కడక్కడా పెచ్చులు వూడిన గది గోడలు మా కంపెనీ పురాతనత్వాన్ని గుర్తుచేసాయి. నేను నిట్టూర్చాను.

బ్రిటిష్ వారి కాలములో తయారైన పాత గడియారము ఐదుసార్లు మ్రోగింది.

డ్యూటీ అయిపోయింది.

* * * * * *

"కాఫీ చల్లారిపోతోందండి" మా ఆవిడ మాటలు విని కాఫీ కప్పు అందుకున్నాను. కాఫీ బాగా చల్లారిపోయింది.

మా ఆవిడవైపు తిన్నగా చూడలేకపోయాను. రోడ్డువైపు దృష్టి మళ్ళించాను నేను. అంతవరకూ మండిపడిన సూర్యుడు కూడా చల్లబడి పోయాడు.

ఎంత తుచ్ఛమైన కోరిక కోరాడు మా బాస్!

మా బాస్ కోరిక ఎలా చెప్పాలా అని ఆలోచిస్తూ ఆమె వైపు చూసాను. ఇద్దరు పిల్లలతల్లి అయినా అందముగా కనిపించింది ఆమె. ఆనందముగా కనిపించే ఆమె మనసు నొప్పించాలంటే బాధ అనిపించింది.

కానీ, బాస్ కోరిక చెప్పకపోతే ఎలాగ!

"మామిడికాయలు కోద్దామా?" నేను మెల్లిగా అడిగేను.

ఆమె మొహము వెలిగిపోయింది. "బుజ్జీ, బాబు రండిరా రండి డాడీ మామిడికాయలు కోస్తారట" చిన్నిపిల్లలా ఎగురుతూ ఆనందముగా పిల్లలని కేకవేసింది, ఆమె.

ఐదు సంవత్సరాల క్రితం మా పెరటిలో నాటిన మామిడిచెట్టు తొలిసారి కాసింది. మా నలుగురికే అన్నట్లు నాలుగే నాలుగు కాయలు ఉన్నాయి. కాలము కాని కాలములో శ్రావణ భాద్రపదాలలో - కాసిన ఆ కాయలని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు మా ఆవిడా, పిల్లలూ, వారం రోజులనుంచి నన్ను కోరుతూనే ఉన్నారు. కాయలు కోయమని.

"నిజంగా కాయలు కోస్తావా డాడీ?" పరుగెత్తుకొని వచ్చి అడిగింది మాపాప. "అయితే ఆ కాయలు మేము తినవచ్చా?" నేను పాపవైపు ఆశ్చర్యముగా చూసాను. పాప యిలా అడుగుతుందేమిటి!

"మరేమీ లేదండీ" మా ఆవిడ అంది. "కాయలు కోయమని ఎన్నిసార్లు అడిగినా కొయ్యకపోవటముతో వాళ్ళకి అనుమానము వచ్చినట్లుంది"

"ఏమిటది?"

"అప్పుడెప్పుడో నువ్వు చెప్పావుకదా డాడీ. మా చిన్నప్పుడు మీ ఇంట్లో చెట్టు కాయలు ఎవరో వచ్చి కోసుకు పోయారని"

నా మనస్సు గతుక్కుమంది.

"అది భూస్వాముల కాలమని నేను చెప్పానులెండి" మా ఆవిడ అంది. "అయినా మీ నాన్న రైతు కాదు కదా, ఇంజనీర్ అని కూడా చెప్పానండి"

నాకేమి చెప్పాలో తోచలేదు. కాయలు కొయ్యటానికి పెరటివైపు నడిచాను. అది నా ఆరోఏట జరిగింది. మా నాన్నగారు భూమి కౌలుకి తీసుకొని పండించేవారు.

"ఏమోయ్ మామిడిచెట్టు బాగానే కాసినట్లుందే" ఓరోజు మా యింటివైపు వచ్చిన భూస్వామి అన్నాడు "మంచి సైజు కాయలు తొలికాపు కాబోలు"

మా నాన్న తల వూపారు.

"మరి మేము రుచి చూడవద్దా?"

"ఎంత మాట, ఎంతమాట" మా నాన్నగారు అన్నారు. "అంతా తమ దయే కదండీ"

మరునాడు కాయలు కోసి బుట్టలో వేసుకొని వెళుతున్న నాన్నగారి మీద కోపం వచ్చింది. మామిడికాయలు కావాలనీ పేచీ పెట్టాను.

"మామిడి కాయలు కావాలట, మామిడి కాయలు. భూస్వామి దయ లేకపోతే మన నోట్లో పడేది కాయ కాదు, మట్టి" నన్ను వెనక్కు తోసి వెళ్ళిపోయారు నాన్న.

ఆ సంఘటన ఎప్పుడో మా ఆవిడకీ, పిల్లలకు చెప్పినట్టు వున్నాను.

"చూడు డాడీ, తమ్ముడు పెద్దకాయ తీసేసుకున్నాడు" గట్టిగా అరిచింది, మా పాప.

నాకు కోపం వచ్చింది.

"ఏమిటా కక్కుర్తి" పరుగెత్తి వాడిని పట్టుకున్నాను. వీపుమీద రెండు అంటించి మామిడికాయ లాగేసుకున్నాను.

"ఏమిటండీ అలా కొడుతున్నారు" మా ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "పాపం చిన్నవాడు! ఒక కాయ తింటే తింటాడు. మనకాయలే కదండీ?"

"కావే, ఇవి మనకాయలు కావు" పిచ్చివాడిలా అరిచేను నేను "చెట్టుమనదే, కానీ కాయలు మా బాస్‌వి"

ఆవిడ ఆశ్చర్యముగా చూసింది.

"మా బాస్ మనవడు అమెరికా నుంచి వచ్చాడట. వాడికి మామిడిపళ్ళు తినిపించాలని వుందిట మా బాస్‌కి."

"అందుకని ?"

"నిన్న మనయింటికి వచ్చినప్పుడు, మామిడికాయలు చూసారు కదా? కావాలన్నారు"

"అయితే?"

"బాస్ కదా మరి. ఇవ్వక తప్పదు. మాలాంటి సిబ్బందుల బ్రతుకులు అతని చేతిలో వుంటాయి" మా ఆవిడ అలా వుండిపోయింది.

నిముషాలు భరువుగా అడుగులు వేస్తూ వెళ్ళాయి. ఆ నాలుగు కాయలనీ సంచిలో సర్దుకున్నాను.

"సంవత్సరాలు గడిచిపోయినా ఏమార్పూ రాలేదన్నమాట" మా ఆవిడ నిట్టూరుస్తూ అంది. "నాడు భూస్వాములు, నేడు ఆఫీసరులు"

"నిజమేనే, నాటి భూస్వాములే నేటి పారిశ్రామివేత్తలు, మేనేజరులు, సారా పాతదే, సీసా మాత్రం కొత్తది. పాందూరి పంచెలు బదులు సఫారీ సూటులు అంతే. సఫారీ సూట్లు వేసుకొని, వేషం మార్చుకున్నా మనస్తత్వాలు పాతవే. సగటు మనిషి బాగా బ్రతకడానికి ఒకరి దయ అవసరము. నాడు భూస్వామి, నేడు బాస్"

నేను గేటువైపు నడిచాను.

పసిడి మబ్బుల మామిడి పళ్ళని బుట్టలో వేసుకొని పశ్చిమాంబర ప్రాంగణము నుంచి బయలు దేరి పోయాడు. రేపటి నిలకడ గురించి ఆలోచించే సూర్యుడు.

(ఎ.ఐ.ఆర్ 16-1-93)